# త్రిశంకుడి స్వర్గం

"ఇదిగో, నిన్నేనయ్యా శేఖరం! ఏమిటా దూకుడు? నేనూ వస్తున్నానుండు..."

—వెనుకనుంచీ ఈ మాటలు వినిపించినప్పుడే అనుకున్నాను. ఈ ప్రయాణం పూర్తయ్యేలోగా తలనొప్పి తప్పదని!

అయినా ప్రారంభమయ్యేదాకా ఊరుకోకుండా రాకుండా చూచుకోడం మంచిదిగదా! నేల ఈనినట్టుగా ప్లాట్‌ఫారం కిటకిట లాడిపోతూంది. అడుగులు సాచివేస్తూ జనం మరుగున తలచాటు చేసుకోడానికి ప్రయత్నించాను. వెనుకవైపునుంచి మళ్ళీ మళ్ళీ పిలుపు వినిపిస్తున్నట్టే అనుమానం! నన్ను చూడు, నా అందం చూడు అంటూ మునుపటి కొక రాజకుమారుడి

వెంట తగులుకున్న దేవతాస్త్రీలా ఈ పుణ్యాత్ముడొకడు దాపురించాడు నాకు!

దిగుతున్న, ఎక్కుతున్న ప్రయాణీకులకు మధ్య తాత్కాలికంగా ఒక రాజీ ఒడంబడిక కుదిరినట్టుంది. దిగేవాళ్ళు చింతపండు మూటల్లా ద్వారాల్లోనుంచీ ఈవల పడుతుండగా, ఎక్కేవాళ్ళు కిటికీలనే ద్వారాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఎలాగో ఓ పెట్టెలో జొరబడి, కూచోడానికొక సీటు గూడా చూచుకోగలిగాను. కానీ చేతికందిన కవళం నోటికందే ప్రాప్తం లేకుండా పోయింది. సుడిగాలిలా ఒరుసుకుంటూ వెళ్ళి 'అబ్బో, తావు కనిపెట్టేశావే!' అంటూ నేను చూచుకున్న సీటును కన్ను మూసి తెరిచినంతసేపట్లో దురాక్రమణ చేసేశాడు కామేశం. అంతటితో ఎక్కడ ఊరుకున్నాడు! అప్పటికేదో దయాధర్మభిక్షులాగా 'పోనీలే, నువ్వూ కూచో' అంటూ నాకు కొన్ని చదరపు సెంటిమీటర్ల జాగా ప్రసాదించాడు.

"అన్నట్టెందాకా?" — కామేశం సంధించిన మొదటి బాణం. చెప్పుకున్నాను.

"అరరే, నువ్వూ అక్కడికేనా! పరవాలేదే! ఏమిటో వ్యవహారం?"

చూచారా, ఇదే కామేశంతో వచ్చిన చిక్కు! కొన్ని ఊళ్ళకు రాకపోకలు సల్పడం, కొందరు వ్యక్తులతో పరిచయాలు కలిగివుండడం, కొన్ని కొన్ని సదుపాయాలు అనుభవించడం — ఇలాంటివాటికి తాను గుత్తగా లైసెన్సు పుచ్చుకున్నట్టు వ్యవహరిస్తాడు కామేశం.

నాదగ్గరనుంచి జవాబు లేకపోయేసరికి, 'సర్లే, ఎవరి పనులు వారికుంటాయి' అంటూ నేనా వూరికి వెళ్ళిరావడానికి అతడు పర్మిషన్ జారీచేసేశాడు. కానీ అంతలోనే నాపట్ల అంతగా ఔదార్యం వహించడం సంభావ్యం కాదనిపించిందేమో, 'ఎన్నాళ్ళుంటావ్?' అన్నాడు.

"అబ్బే, నా కేమంత పెద్దపనులున్నాయిలే కామేశం! రేపీపాటికల్లా మన వూళ్లో ఉండనూ" అన్నాను. నా మాటల్లో నామట్టుకు నాకే క్షమాపణ ధ్వనించింది.

కామేశం పుంజుకున్నాడు.

"ఏమిటోనయ్యా శేఖరం! నే నెప్పుడు పట్నానికి వెళ్ళిపడినా వారం పదిరోజులదాకా అక్కడినుంచి విడిపించుకోలేను. ఏం చేయమంటావు చెప్పు? వీధి వీధికీ ఫ్రెండ్సే నాకు! అప్పలరాజు నెరుగుదువా, యం. పి. గా పోటీచేసి ఓడిపోయాడే, వాడే! వాడూ, నేనూ క్లాసుమేట్లం. అయితే అప్పుడొకసారి కొట్లాడుకుని విడిపోయామనుకో! కారణం చాలా చిన్నది. ఓ గమ్మత్తయిన ఆటంటే చాలా యిష్టం వాడికి! ఏం లేదు. నూలుదారానికి ఓ బిస్కట్టు కట్టి, బకెట్టును చేదబావిలోకి వదిలినట్టుగా దాన్నొక పుల్లీనుంచి క్రిందికి జారవేసేవాడు. నేను ఎగిరెగిరి నోటితోనే దాన్ని అందుకోవాలి. దారాన్ని క్రిందికి వదుల్తూ, పైకి లాగుతూ ఎగురుతున్న నన్ను చూచి వాడు తెగనవ్వసాగాడు. కాళ్ళు నొప్పెడుతున్నాయని చెప్పి నేనా ఆటకు రానన్నాను. అయితే నువ్వు నా సావాసం వద్దు పొమ్మన్నాడు అప్పలరాజు. అదే విడిపోవడం! మళ్ళీ మొన్నటి యెన్నికల్లోనే మేము కలిసింది!

వచ్చిన పది పన్నెండువేల ఓట్లయినా యెలా వచ్చాయంటావు? నేను నడుం కట్టి వాడి తరఫున పనిచేయబట్టి! ఆ కృతజ్ఞత మాత్రం దండిగానే వుందిలే! కనిపిస్తే వదిలిపెట్టడు. ఆకాడికి వాడే నయం. ఇంకొకడున్నాడు మురళీధరం. వాడైతే నన్నెప్పటికీ తనదగ్గరే ఉండిపొమ్మంటాడు. బస్టాండుకు దగ్గరగా శ్రీదేవీ సిల్కు హౌస్ అని వుందే, అది వాడిదే! ఇప్పుడైతే వాడు కాలక్షేపంకోసమని ఓ జవిళికొట్టు తెరిచిపెట్టుకున్నాడుగానీ, వాళ్ళ తాతగారు ఆయన హయాంలో నారగింటిపాళ్యానికి సోల్ మిరాశిదారు. వాళ్ళ బంగళా చుట్టూరా తోటలో పనసచెట్లుండేవి. శేఖరం, ఒక్కొక్క పండునూ ఒక భారీ మనిషి యెత్తలేకపోయేవాడు. అర మైలు దూరందాకా కొడుతుండేది వాసన. చెట్టెక్కి కాయను కోసి పదిలంగా క్రిందికి తీసుకరాగలిగితే ఆ కాయ నీదే ననేవాడు మురళీధరం. భలే కొంటె కోణంగి అనుకో! వాళ్ల నాన్న మాత్రం? అంతటి వేటగాడు ఈ గడ్డపైన లేడే! ఒకసారి నేనూ, మురళీ ఆయనతో కలిసి వేట చూడ్డానికి వెళ్ళాం, ఓ పదుపంది తుపాకీ వేటు తప్పించుకుని మాపై కొచ్చేసింది..."

ప్రయాణంలో యింకా ఒక్క స్టేషనైనా గడవలేదు. అప్పల్రాజు దగ్గర ప్రారంభమైన కథ పదుపందిదాకా వచ్చింది. ఒక పదుపంది, ముగ్గురు మనుషులు, వెరళీ నాలుగు జీవాల్లో పది పమైందన్న జిజ్ఞాస నాకు లేదు. నేను నా సంచీలోనుంచి పుస్తకం పైకి తీశాను.

కానీ కామేశం మాటల జడివానలోనుంచి నా పుస్తకం నాకు రక్షణ యివ్వగలదన్న ఆశగూడా అడియాసే అయిపోయింది.

"ఏమిటిది, పుస్తకమా?" – అంటూ చరాలున దాన్ని నా చేతిలోనుంచి లాగేసుకున్నాడు కామేశం. "ఏం పుస్తకం?" అన్నాడు. నాలుగు పుటలు త్రిప్పి "నాన్సెన్స్, ఏముందిందులో?" అన్నాడు. నా పుస్తకం నా చేతికి దొరక్కుండా జాగ్రత్తపడుతూ "అన్నట్లొకసారి ఏమయిందంటే శేఖరం" అంటూ ఈసారి జ్యావల్లిని చెవిదాకా లాగి, అక్షయతూణీరం అందుకున్నాడు.

"బాణావరం పైడి రాజుగారి పేరు విన్నావా ఎప్పుడైనా! 'బారట్లా' పట్టా పుచ్చుకుని బారులో పేరు నమోదు చేయించుకోలేదంటే ఆయన స్టేటస్ ఏమిటో ఊహించుకోవచ్చు. ఆయన మా నాన్నగారికి క్లోజ్ ఫ్రండ్. ఏదో పనిమీద వెళ్ళి వాళ్ళింట్లో నాలుగైదు రోజులు ఉండవలసివచ్చింది. ఆ ఆదరణ, ఆ గౌరవం, ఆ భోజనాలు, వాటినిగురించి చెప్పడమెందుకులే! ఆ లంకంత మేడలో ప్రొద్దుపోక చదువుకోడానికి ఏదైనా మేత దొరికితే బాగుండునని వెళ్ళి పుస్తకాల బీరువా యెదుట నిల్చున్నాను. అద్దాల వెనుక భారతం, భాగవతం, భగవద్గీత, కొరాను, షేక్స్పియరు, షెల్లీ, కీట్సు, విశ్వనాథ, బాపిరాజు అలాంటివి మంచి మంచి లావుపాటి పుస్తకాలెన్నో వున్నాయి. లేని దొకటే! ... తాళంచెవి!"

"అడగలేకపోయావా?"

"అడిగా నడిగాను. పైడిరాజుగారి నడిగితే అమ్మగారి నడిగి చూడమన్నారు. అమ్మగారి నడిగితే అబ్బాయిగారి నడిగి కనుక్కోమంది. అబ్బాయిగారి నడిగితే చెల్లెమ్మకు తెలిసుండా లన్నాడు. చెల్లెమ్మ నడిగితే తానా తాళంచెవిని ఆరు మాసాలకు

మునుపెప్పుడో చూచినట్టు జ్ఞాపకం అంటుంది. మొత్తంమీద తేలిన సారాంశం ఏమిటంటే – గడచిన సంవత్సర కాలంలో ఆ బీరువా తెరువబడిన పాపాన పోలేదు. మరైతే అక్కడ పుస్తకాలుండడం యెందుకు – అంటావు నువ్వు! అదే పొరబాటు. పుస్తకాలు బీరువా కలంకారం. బీరువా ఆ మేడ కలంకారం. మేడ ఆ వూరి కలంకారం..."

"ఆ ఊరు?"

"అదేం వూరు, పాడు వూరు!"... విదిలించిపారేశాడు కామేశం. "పాడు గోడలు. పశువుల కొట్టాల్లాంటి ఇళ్ళు, మాసిన తలల మురికి బట్టల మనుషులు. అంతెందుకు? అక్కడ ఆ మేడ లేకపోతే ఆ వూరికి నల్లముంతతో నీళ్ళు పుట్టవనుకో!"

దానిపైన కామేశం అలాంటి అభిప్రాయం కలిగి వుండడం ఆ వూరి దురదృష్టం. ఏం చేద్దాం! శతాబ్దాల తరబడీ ఆ వూరలాగే పడివుంది. ఇకమీదట గూడా అలాగే పడి వుంటుంది. మాటలెన్నయినా చెప్పొచ్చు గానీ అలాంటి వూళ్ళను బాగుచేయడం సులభసాధ్యమేమీ గాదు. నేను కాదనను. కానీ నాకు బాధయినా, ఆశ్చర్యమైనా ఇల్లలికేపాటి భాగ్యానికి మురిసిపోయి ఈగ తన స్వవిషయం మరిచిపోయి నందుకే!

కామేశం స్టేట్‌మెంట్లలో బొత్తిగా నిజం లేకపోలేదని మాత్రం నేను ఒప్పుకుంటాను. వాళ్ళ నాన్న బాణావరం పైడి రాజుగారి కమతంలో పాలేర్లపైన పెద్ద తాబేదారుగా వ్యవహ రించాడు. డిఫీలై, డిపాజిట్టు పోగొట్టుకున్న అప్పలరాజుకు పాటలు పాడి, కరపత్రాలు పంచి కామేశం ఎన్నికల్లో కొంత

కాలిపనీ, చేతిపనీ చేసి పెట్టాడు. చిన్నప్పుడు నారగింటి పాళెంలో మేనమామగారింట వుండి చదువుకున్నప్పుడు గోలీకాయ లాడు కోడంలో మురళీధరానికి సహచరుడుగా పనికొచ్చి వుంటాడు. ఆమాత్రపు సాన్నిహిత్యాన్ని భూతద్దంపట్టి చూపించడంవల్ల కామేశానికి ఒరిగేదేమిటో బోధపడదు. బ్రతుకు వెళ్ళదీయడ మెలాగన్నది గాకుండా, డబ్బెలా ఖర్చుచేయడమన్నది ప్రధాన సమస్యగా వున్న ఆ ఊర్ధ్వలోకాలు కామేశంలాంటి వ్యక్తిని యెంటర్ టెయిన్ చేయడంలాంటి పనికిమాలిన పనికి పూను కుంటాయంటే నమ్మడం కష్టమే!

గమ్యస్థానాని కింక ఓ అరగంట ప్రయాణం వుందనగా ప్రొద్దుపోయి, చీకటి పడింది.

"రాత్రికి బసెక్కడ?"—అన్నాడు కామేశం.

"తెలిసినవాళ్ళెవరో వున్నారు. కానీ వాళ్ళని తొందర పెట్టడ మెందుకులే కామేశం! నాలుగో, అయిదో చెల్లించి హోటల్లో గది తీసుకుంటాను" అన్నాను.

"చూచావా, చూచావా?"— ఆశ్చర్యాతిరేకంతో నోరు తెరిచేశాడు కామేశం. "అంతపనీ చేస్తే ఇంకేమైనా వుందీ! మా తమ్ముడు పీక నొక్కేయడూ! తెలియదూ, పద్మనాభమని ఉన్నాడులే! నేనెప్పుడు వచ్చినా అక్కడికి వెళ్ళాల్సిందే! యెన్నిరోజు లుండినా అక్కడుండాల్సిందే! కాలేజిలో అదేదో సబ్జక్టుకు వాడు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు. నవభారత్ హోటల్ కెదురుగా ఓ పచ్చ మిద్దె వుండే, అదే వాడిల్లు. అసలా యిల్లొక సేటుది. ఆ సేటు కాస్తా కళ్ళు మూస్తే, వాడి భార్యా

దగ్గరినుంచి మావాడు సలీసుగా దాన్ని కొట్టేశాడు. క్రింద వంటగదీ, స్నానాలగదీ గాక మూడు గదులు. ఒకటి లైబ్రరీ, ఇంకొకటి యెవరైనా వస్తే కూచోడానికి. మూడోది పూజ గది. మిద్దెపైన ఓ గది కాకుండా పెద్ద హాలు. నూరు మందైనా అందులో హాయిగా పడుకోవచ్చు. ఇల్లు పూరా పాలగచ్చు. పాలు పోసి యెత్తుకోవచ్చు. తల దువ్వుకోడానికి అద్దం అక్కర్లేదు. గోడల్లోనే ముఖం చూచుకోవచ్చు..."

గృహవర్ణన కంతరాయం కలిగించే దురుద్దేశం లేదని చెప్పను. అడ్డుతగిలి "ఆయన నీ కెలా తమ్ముడు?" అని ప్రశ్నించాను.

"వరుసకు తమ్ముడేనయ్యా! వాడి తల్లీ, నా తల్లీ పిన్నమ్మ, పెద్దమ్మల బిడ్డలు. నా మాటంటే యెంత గురుత్వ మనుకున్నావు! చెప్పలేను. వాడి భార్య వాడికి డిటో. బావా, బావా అంటూ..."

"అవునవును. రక్త బాంధవ్యం. అంతే మరి!" అంటూ ముక్తసరిగా త్రుంచేశాను.

*   *   *   *   *

ఇంటితో పోల్చిచూస్తే హోటలు గదిలో సదుపాయాలు తక్కువైపోయాయని కాదు. కొత్తచోటు కావడంవల్లనేమో ఒకపట్టాన నిద్రపట్టింది గాదు. నిద్రపట్టని కారణాన్ని పురస్కరించుకుని కామేశాన్ని పలుసార్లు తిట్టుకోవలసిన అవసరం ఏర్పడింది. నా పుస్తకం నా దగ్గరుంటే చిరాకు లేకుండా నిద్రపట్టే దాకా చదువుతూ వుండేవాణ్ణి. రైల్లో దాన్ని నా దగ్గరనుంచి

లాక్కోవడం మొకటే తెలుసు! తిరిగి యివ్వనేలేదు మహాను భావుడు.

అడిగి తీసుకోకపోవడం నాదీ పొరబాటే! 'తుఫాను'లో నుంచి బయటపడే తొందరలో నాకు పుస్తకంమీద ధ్యాస లేకపోయింది.

అర్థరాత్రి తరువా తెప్పుడో నిద్రాదేవత కరుణించింది. అయినా వాడుక మేరకు ఆరు గంటలకే మేలుకున్నాను. నిద్ర లేవగానే కొంతదూరం నడచిరావడం నా అలవాటు. ఎంత పట్టణమైనా అలవాటు తప్పించడ మెందుకని క్రిందికి దిగి వచ్చాను. రెండు మూడు వీధులు నడిచి కోనేటి మిట్టదగ్గర మలుపు తిరుగుతుండగా నవభారత్ హోటల్ కనిపించింది. దాని యెట్టయెదుట పచ్చటి మిద్దె! ఆ మిద్దె కనిపించగానే నాలో కలిగిన మొదటి ఊహ — వరాండాలోనో, కిటికీ సందులోనో కామేశం కనిపిస్తే నా పుస్తకం తీసుకోవచ్చుగదా అని!

చరచరా ఆ మేడవైపు నడక సాగించాను.

పేవ్‌మెంటు కంచుగా పిట్టగోడ, చిన్న గేటు దాటుకుని గృహావరణలో కాలుపెట్టాను. ముద్దలా ముడుచుకున్న క్రోటన్ మొక్కల నడుమ, మంచులో చల్లగా తడిసిన నాపరాళ్ళతో ఆ యింటి ముంగిలి అప్పుడే నీళ్ళన్నీ వదిలిపెట్టిన చన్నీటి తొట్టిలా వుంది. లోవైపున తాళం బిగించిన ఇనుప కమ్మీల తలుపు కీవల ముచ్చటగా మూడు మెట్లున్నాయి. ముఖంనిండా ముసుగు కప్పుకున్న కామేశం ఆ మెట్లమీద కూలబడి యెందుకో-దీర్ఘాలోచనలో నిమగ్నుడై వున్నాడు.

భుజంపైన చేయి వేశాను. ఉలికిపడి కళ్ళు తెరిచాడు. వెంటనే నోరుగూడా విడివడింది.

"వెళ్ళనేగూడదు. బుద్ధి పొరబాటయిపోయింది. రెండో సినిమాకు వెళ్ళాను. వీళ్ళిలా మొద్దునిద్రపోవడం యిదే మొదటిసారి—మొన్న సాయంకాలం యిక్కడెక్కడో పెళ్ళికని వెళ్ళి ఆ రాత్రంతా కంటిపైన రెప్పవేయకుండా జాగారం వుండిపోయారట! మెలకువంటూ వస్తే దిగివచ్చి తలుపు తెరవకుండా వుండేవాళ్ళు కారు. పాపం! చూడు, ఫాన్‌గాలిలోనైతే నాకు నిద్రపట్టదని మా తమ్ముడు పడక తీసుకొచ్చి వరాండాలో వేసేశాడు గూడా..."

నిజమే. కవాటబంధనం గావింపబడివున్న సింహద్వారానికీ, లోపల తాళం బిగించివున్న ఇనుపకమ్మీల తలుపుకు నడుమ వరాండాలో జానెడెత్తు తెల్లటి పరుపు కన్నులకు విందుగా కానవస్తోంది. పైడిరాజుగారి అద్దాల బీరువాలో పుస్తకంలా, అప్పలరాజు బాల్యక్రీడలో నోటికందని బిస్కట్టులా, మురళీధరం వాళ్ళ పనసతోటలో చిటారుకొమ్మకు కాసిన పనసకాయలా ఆ పరుపు గూడా చూపులకు మాత్రమే అందుతోంది. చేతుల కందడమున్నూ లేదు, మనిషికి దక్కడమున్నూ లేదు!